## 85. అందరూ గురువులే

తాత్త్వికుడైన ఓ వ్యక్తికో గయ్యాళి భార్య వుంది. ఆమె అతన్ని అనుక్షణం తిడుతూండేది. ఓ రోజు అతని దగ్గరకి వచ్చి అతని భార్య మరణించిందని చెప్పారు కొందరు. అది తెలియగానే ఆ తాత్త్వికుడు 'అయ్యో! ఇక ఆమె లేదా?' అని బాధగా అన్నాడు.

"నీకు నీ భార్య పోయినందుకు నిజంగా బాధగా వుందా?" అడిగారు వాళ్ళు.

"అవును." జవాబు చెప్పాడు అతను.

"ఇదెక్కడి వింత? నిత్యం తిట్టేవాళ్ళ మీద నీకెందుకు అంత ప్రేమ?" ప్రశ్నించారు వాళ్ళు.

"ఆమె తిట్ల వల్ల నేను నా సహనాన్ని వృద్ధి చేసుకునే అవకాశం కలుగుతూండేది. ఇప్పుడు అది పోయింది కదా అని బాధ." జవాబు చెప్పాడు ఆ తాత్త్వికుడు.

## 86. అడ్డు

ఓ పండితుడు ఓ ఆత్మ జ్ఞాని దగ్గరకి వెళ్ళి తనకి మోక్షవిద్యని ప్రసాదించమని కోరుకున్నాడు.

వెంటనే ఆ జ్ఞాని తన ఎదురుగా వున్న గ్లాసులో నీళ్ళని పోయసాగాడు. నీళ్ళు నిండి ఆ గ్లాసులోంచి నీరు బయటకి కారుతున్నా పోయడం ఆపలేదాయన.

"ఆగండి. ఖాళీ గ్లాసు నిండాక కూడా నీళ్ళు పోస్తే అవి కారిపోవూ?" చెప్పాడు ఆ పండితుడు.

"ఇప్పుడర్థమైందా? నీ మనసుని నువ్వు ఖాళీ చేసుకుంటే దాన్ని ఆత్మ జ్ఞానంతో నింపగలను. కాని నువ్వు అందులో ఏర్పరచుకున్న వివిధ

అభిప్రాయాలతో అది నిండి వుంటే నీకు ఆత్మజ్ఞానం ఇచ్చినా ప్రయోజనం ఏమిటి? అది అందులోకి వెళ్ళక బయటకి కారిపోతుంది.'' నవ్వుతూ వివరించాడు ఆత్మ జ్ఞాని.

మనలో ఆధ్యాత్మిక మార్గంలో వున్నవారిలో చాలామందికి ఆ సంబంధమైన స్థిరమైన అభిప్రాయాలు ఏర్పడి వుంటాయి. అవే వారికి మోక్షమార్గంలో సాగడానికి అడ్డు నిలుస్తాయి.

## 87. అసాధ్యం

న్యూయార్క్‌లో ఆధునిక శాస్త్రజ్ఞుల కాన్ఫరెన్స్ జరిగింది. అందులో అంతా ఇక దేవుడి అవసరం లేదని తీర్మానించారు. ఒక బృందం దేవుడి దగ్గరకి వెళ్ళి ఆయనతో చెప్పింది.

''ఓ దేవా! ఇక మా మానవులకి నీ అవసరం లేదు. మనిషి శరీరంతో క్లోనింగ్ చేసి ఎన్ని శరీరాలనైనా ఇక మేం సృష్టించుకునే శక్తిని సంపాదించుకున్నాం. కాబట్టి ఇక నీకు గుళ్ళు కట్టం. ఉన్న గుళ్ళల్లో పూజలు ఆపేయదలచుకున్నాం.''

దేవుడు చిరునవ్వుతో జవాబిచ్చాడు.

''అలాగే. కానీ ఆ విషయం నాకు నిశ్చయంగా తెలిసేలా ఓ మానవ శరీరాన్ని సృష్టించి చూపించండి. అప్పుడు మీరు సర్వ స్వతంత్రులని ఒప్పుకుంటాను.''

''అలాగే' అని వాళ్ళు వంగి నేల మీది మట్టిని తీసుకుంటూంటే దేవుడు 'ఆగండాగండి. నా మట్టిని ఎందుకు తీసుకుంటున్నారు? మీ మట్టిని మీరే సృష్టించుకోండి.'' అని అభ్యంతరం చెప్పాడు.

అది తమకి అసాధ్యమని గ్రహించిన ఆ శాస్త్రజ్ఞుల బృందం సిగ్గుపడి దేవుడికి క్షమాపణలు చెప్పి వెనుదిరిగింది.